

కిష్టాపూర్‌లో ఘనంగా రథోత్సవం

బీర్కూర్, మే23: మండలం కిష్టాపూర్ గ్రామంలో పూర్ణిమ సందర్భం గా గురువారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామ వీధుల గుండా ముందుకు సాగింది. రథంలో హనుమాన్‌జీ ఆసీనులైన భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి యేటా హనుమాన్ జయంతి అనంతరం వచ్చే పౌర్ణమి నాడు హనుమాన్ ఆలయం నుంచి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే కుస్తీ పోటీలు నిర్వహించారు.



కౌలుకు డిమాండ్!

- ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ భూములకు పెరిగిన కౌలు
- మంజీరా, గోదావరి ప్రాజెక్టుల కింద కౌలుకు తీసుకునేందుకు పోటాపోటీ
- రెండు పంటలు పండే భూములకు మరింత డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు

నిజామాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ భూములకు కౌలు పెరిగింది. జిల్లాలో వరిసాగు పెరుగుతుండటంతో రెండు పంటలు పండే భూములకు డిమాండ్ పెరుగుతోంది. ప్రాజెక్టు నుంచి సాగునీరు అందే భూములతో పాటు మంజీరా, గోదావరి నదుల వెంట ఉన్న వ్యవసాయ భూములకు ఎక్కువగా డిమాండ్ వస్తోంది. కౌలు రైతులు కూడా ఈ భూములను పోటీపడి తీసుకుంటున్నారు. ప్రతీయేడు కౌలు పెరుగుతున్నా.. వెనకడుగు వేయడం లేదు. తమకున్న భూమితో పాటు కొంత కౌలు తీసుకొని వ్యవసాయాన్ని చేస్తున్నారు. సన్నరకాలకు డిమాండ్ పెరగడంతో ఈ సంవత్సరం కూడా ఎక్కువ మొత్తంలో వరి వేసేందుకు రైతులు సిద్ధమవుతుండగా.. గత సంవత్సరం కంటే కౌలు కొన్ని ప్రాంతాల్లో వెయ్యి నుంచి రెండువేల వరకు పెరిగింది. సన్నాలకు బోనస్ కూడా ప్రభుత్వం ప్రకటించడంతో భూములు ఉన్న వారు కొంత మంది గతంలో కౌలుకు ఇవ్వగా.. ప్రస్తుతం మళ్లీ పంట వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంత మంది రైతులు కౌలుకు ఇవ్వడం చేస్తూనే బోనస్‌పై ఒప్పందాలను చేసుకుంటున్నారు. వానాకాలం సాగుకు ఇంకా వారం రోజులే సమయం ఉండడంతో గ్రామాల్లో కౌలు ఒప్పందాలు చేసుకుంటున్నారు. వరి సాగు చేసేందుకు నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. వరి పండించే భూములతో పాటు ఆరుతడి పంటలు మొక్కజొన్న, సోయా, పసుపు పండే భూములకు కూడా కొద్దిగా కౌలు పెరిగింది.

వానాకాలం సాగుకు సమాయత్తం

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వానాకాలం వర్షాలు ఆరంభం కాగానే వరి, మొక్కజొన్న, సోయా, పసుపుతో పాటు ఇతర ఆరుతడి పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు ప్రాజెక్టులైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ఆయకట్టు ఉండడం.. చెరువులు కూడా ఎక్కువగా ఉండటం వల్ల సాగు విస్తీర్ణం ఎక్కువగా అవుతోంది.ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందించడం వల్ల ప్రతీయేడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ సంవత్సరం కూడా 5.54 లక్షల ఎకరాల సాగు వానాకాలంలో అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వానాకాలం సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఈ విత్తనాలను సరఫరా చేస్తున్నారు. ఎరువులనూ అందిస్తున్నారు.

ప్రాజెక్టు పరిధిలో భూములకు డిమాండ్

వానాకాలం ఆరంభం కానుండటంతో రెండు పంటలు పండే భూములకు డిమాండ్ భారీగా పెరిగింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న ఆయకట్టుకు ఎక్కువగా డిమాండ్ వస్తుంది. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో రెండు పంటలు ప్రతీ సంవత్సరం పండుతుండడం వల్ల ఎక్కువ మంది రైతులు పోటీ పడుతున్నారు. తమకున్న భూమితో పాటు కౌలుకు కొంత తీసుకుంటూ వ్యవసాయాన్ని చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుతో పాటు మంజీరా, గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న భూములకు కూడా భారీగా డిమాండ్ పెరిగింది. గత సంవత్సరం కంటే కౌలు కూడా ఎక్కువైంది. బోధన్ డివిజన్ పరిధిలో రెండు పంటలు పండే భూములకు సంవత్సరానికి 30 నుంచి 32 బస్తాల (70కిలోల) వరకు కౌలు ఇచ్చే విధంగా ఒప్పందాలను చేసుకుంటున్నారు. ఒక పంటకు 14 నుంచి 17 సంచుల వరకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మంజీరా, గోదావరి ఒడ్డున ఉన్న భూములకు మాత్రం ఇంకా ఎక్కువ డిమాండ్ ఉంది. నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల కౌలు రూ. 30వేల నుంచి 32వేల వరకు రైతులు పెడుతున్నారు. గత సంవత్సరం ఈ భూములకు రూ.28వేల నుంచి 30వేల వరకు ధర ఉండేది. వర్ని నుంచి మోస్రా వరకు ఉన్న భూములకు కూడా ఇదే రీతిలో డిమాండ్ కొనసాగుతుంది. ఈ ప్రాంతంలో 28 నుంచి 30 బస్తాల వరకు రెండు పంటలు పండే భూములకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక పంట పండే భూములకు 12 నుంచి 15 బస్తాల మధ్యన ఒప్పందాలు చేసుకుంటున్నారు. గతంతో పోలిస్తే కౌలు పెరిగినా.. తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకుంటున్నామని కొంత మంది రైతులు తెలిపారు.

స్వాహాపర్వం !



రైతునగర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా

బీర్కూర్, మే 23 : జిల్లాలోని బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చదును చేసి అక్రమంగా కబ్జా చేస్తున్నాడు. విషయం గమనించిన స్థానిక యువకులు కొంతమంది గ్రామ పంచాయితీ కార్యదర్శికి ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు చేశారు. గురువారం జీపీ కార్యదర్శి ప్రవీణ్ ఘటన స్థలానికి చేరుకుని భూమిని పరిశీలించాడు. ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా చేస్తుండగా అడ్డుకున్నాడు. భూమి చదును పనులు నిలిపివేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి సదరు వ్యక్తిని హెచ్చరించాడు. అనంతరం భూ కబ్జాపై తహసీల్దార్ లతకు కార్యదర్శి ఫిర్యాదు చేశాడు.

సందర్శన



ముగిసిన కేంద్ర బృందం పర్యటన

సదాశివనగర్,మే 23: మండలంలోని పద్మాజీవాడిలో నాలుగు రోజుల పాటు అభివృద్ధి పనులపై కేంద్రబృందం చేపట్టిన సందర్శన గురువారంతో ముగిసింది. సెంట్రల్ సెక్రటేరియట్ శిక్షణ బృందం గ్రామీణ ప్రాంతాలలోని అభివృద్ధి, ప్రజాఅవసరాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామపంచాయతీలో పల్లె ప్రగతి, చెత్తసేకరణ కార్యక్రమాలను మరింత పకడ్బందీగా చేపడితే పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో నిలిచిన 22 వ ప్యాకేజీ సొరంగ మార్గం పనులు

నత్తనడకన.. సాగునీటి పథకాలు!

- జిల్లాలో ముందుకు సాగని కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు
- నిలిచిపోయిన నాగమడుగు ఎత్తిపోతల పథకం
- నిధులు మంజూరు కాక.. ఏళ్లుగా ఎక్కడి పనులు అక్కడే..

కామారెడ్డి, మే23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందంచడమే లక్ష్యంగా కాళేశ్వరం ప్యాకేజీ 22 పనులతో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. గత పదేళ్లుగా ఈ ఎత్తిపోతల పథకాలకు అరకొర నిధులు వస్తుండడంతో పనులు నత్తనడ కన కొనసాగుతున్నాయి. ఈ ఎత్తిపోతల పథకాలకు నిధుల విడుదలలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తుండడంతో భూసేకరణ జరగడం లేదు. జిల్లాకు గోదావరి జలాలను తీసుకువచ్చేం దుకు ప్యాకేజీ 22 పనులను కాంట్రాక్టర్‌లు నిలిపివేసినట్లు తెలుస్తోంది. కాల్వల తవ్వకాలతోపాటు ఇతరత్రా పనులు చేపట్టడానికిఅవసరమైన భూసేకరణకు నిధులు మంజూరుచేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ప్యాకేజీ 22తోపాటు నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటేనే సాగునీటి పథకాలకు మోక్షం లభించనుంది.

ముందుకు కదలని కాళేశ్వరం పనులు

కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని బీడు భూములను సాగు భూములుగా మార్చేందుకు చేపట్టిన ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్ట్‌లో భాగంగా 22వ ప్యాకేజీ పనులు కాళేశ్వరం ప్రాజెక్ట్ రీడిజైన్‌తో గత ఏడేళ్ల క్రితం మోక్షం లభించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు జిల్లాలకు 2.40లక్షల ఎకరాల ఆయక ట్టుకు సాగునీరు అందించే విధంగా గత ప్రభుత్వం రీడిజైన్ చేసింది. ఈ 22వ ప్యాకేజీ పనుల కు కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ వద్ద భూంపల్లి రిజర్వాయర్ ప్రధానం అయింది. ఇందుకు సంబంధించి కాల్వల తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. భూసేకరణకు నిధులు రాకపోవడంతో ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా ఈ పథకం పనులు ఉన్నాయి. దీనికి తోడు ఈ ప్యాకేజీ పనులు జరిగినప్పటికీ.. పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో మంజూ రు కావడం లేదు. దీంతో కాంట్రాక్టర్‌లు పనులు నిలిపివేశారు.ఈ ప్యాకేజీ పనులు అంచనా వ్యయం 1446 కోట్ల రూపాయలు. మొత్తం 4422 ఎకరాలలో భూ సేకరణ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు 1244 ఎకరాలు మాత్రమే భూసేకరణ చేపట్టారు. నిధులు విడుదల కాకపోవడంతో ఈ పనులు ముందుకు సాగడం లేదు.

ప్యాకేజీ పనుల తీరు ఇలా..

కామారెడ్డి,మెదక్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు 22 వ ప్యాకేజీ పనులను జిల్లాలో చేపట్టారు. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్ నుంచి 100.80కి.మీల మేర కాల్వలు తవ్వాల్సి ఉంది. ఇందులో ఎడమకాల్వ 51 కిలోమీటర్లు, కుడికాల్వ 11 కిలోమీటర్లు, ప్రధాన కాల్వ 14 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ప్రధాన కాల్వ దాదాపు పనులు పూర్తయ్యాయి. కుడి కాల్వ పనులు తుది దశకు చేరుకుంది. ఎడమకాల్వకు సంబంధించి భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయి.ఈ కాల్వతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ప్యాకేజీ నుంచి సొరంగం ద్వారా భూం పల్లి రిజర్వాయర్ వరకు 7560 కి.మీల వరకు కాల్వ నిర్మాణం పనులు చేపట్టాల్సిఉంది. ఈసొరంగం పనులు పూర్తికావడం లేదు. ప్రస్తుతం అప్రోచ్ కాల్వల తవ్వకం మాత్రమే పూర్తయింది.

బిల్లుల చెల్లింపులో జాప్యం

కాళేశ్వరం జలాలను కామారెడ్డి, మెదక్ జిల్లాలకు నీరు అందించేందుకు ప్యాకేజీ 20,21,22 కింద పనులు చేపడుతున్నారు. కామారెడ్డి జిల్లాకు గోదావరి జలాలు తరలించేందుకు ప్రారంభించిన 22వ ప్యాకేజీ పనులు పూర్తికాలేదు. కాల్వల తవ్వకాలతో పాటు ఇతర పనులకు పెద్ద ఎత్తున భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 1244 ఎకరాలలో మాత్రమే భూ సేకరణ చేపట్టారు. గత ప్రభుత్వం నుంచి మొదలుకొని ఇప్పటివరకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో కాంట్రాక్టర్‌లు పనులు ఆపివేశారు. దీంతో కాళేశ్వరం పనులు ముందుకు సాగడం లేదు.

5శాతం పనులే పూర్తయిన నాగమడుగు ఎత్తిపోతల పథకం

జుక్కల్ నియోజకవర్గంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిజాంసాగర్ దిగువన నాగమడుగు వద్ద రూ.476 కోట్లతో ఎత్తిపోతల పథకాలను మూడేళ్ల క్రితం గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికి 5శాతం పనులు కూడా పూర్తికాలేదు. పథకాన్ని రీడిజై న్ చేసి మరో 10 వేల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించినా.. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ప్రాజెక్ట్ గురించి పట్టించుకునేవారే కరువయ్యారు. దీనికి తోడు నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్‌లు నామమాత్రంగా పనులు చేపడుతు న్నారు. పంప్‌హౌస్ నిర్మించే ప్రాంతంలో కరకట్టలు, కాల్వల నిర్మాణాలకు భూసేకరణ చేయాల్సి ఉంది. రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసినప్పటికీ.. నిధులు విడుదలకాకపోవడంతో ఈ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

వేసవిలో మంజీరాకు జలకళ



- మంజీరాలో చెక్‌డ్యాం నిర్మాణంతో తాగునీటి సమస్యకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న బాన్సువాడ వాసులు

(బాన్సువాడ టౌన్, మే 23)

సాధారణంగా వేసవి కాలం వచ్చిందంటే చాలు పల్లెల్లో, పట్టణాల్లో తాగునీటి సమస్యలే ప్రధానంగా దర్శనమిస్తుంటాయి. ఎక్కడ చూసినా నీటి బిందెలతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తీసుకొస్తున్న దృశ్యాలు కనబడుతుంటాయి. జిల్లాలోని బాన్సువాడలో సైతం ఒకప్పుడు వేసవికాలంలో తాగునీటి సమస్య ఉండేది. కానీ నేడు మంజీరా నదిలో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడంతో మండు వేసవిలోనూ మంజీరా నది నిండుకుండలా కనబడుతోంది. నదిలో నీరు నిల్వ ఉండడంతో తాగు, సాగునీటి సమస్యకు చెక్ పడిందనే చెప్పవచ్చు. మంజీరాలో చెక్ డ్యాం నిర్మాణంతో ప్రజలతో పాటు మూగజీవాలకు కూడా తాగునీటికి ఢోకా లేకుండాపోయింది. ప్రస్తుతం మంజీరాలో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడంతో మండు వేసవిలోనూ మంజీరాకు జలకళ సంతరించుకుంటుంది. పిట్లం మండలం బొల్లక్‌పల్లి బ్రిడ్జి వరకు నీరు నిల్వ ఉంది. గతంలో చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టడం వల్ల నేడు సత్ఫలితాలను ఇస్తున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంజీరా నదిలో చెక్ డ్యాం నిర్మాణం


బాన్సువాడ పరివాహక ప్రాంతంలో గల మంజీరా నదిలో గతంలో అప్పటి స్పీకర్, బాన్సువాడ ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వేసవిలో వచ్చే నీటి సమస్యలను అధిగమించేందుకు చింతల్ నాగారం శివారులో నిర్మించిన ఈ చెక్‌డ్యాంలో 3వేల క్యూసెక్కులకు పైగా నీటి నిల్వ ఉంటుంది. సుమారు 15.98 కోట్లతో 450 మీటర్ల పొడవు, 3 మీటర్ల ఎత్తుతో చెక్‌డ్యాం నిర్మాణం జరిగింది. చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి కావడంతో సమారు 3 కిలోమీటర్ల మేర మంజీరాలో నీరు దర్శనమిస్తోంది. సకాలంలో చెక్‌డ్యాం నిర్మాణం పూర్తై ప్రజలకు తాగు , సాగు నీటికి ఢోకా లేకుండా పోవడంతో బాన్సువాడ పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతీ వేసవిలో చాలా మట్టుకు బోర్లలో నీరు వట్టిపోయేదని, ఈసారి భూగర్భజలాలు తగ్గకపోవడంతో ఊపిరి పీల్చుకున్నామని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే..

ఆలయాల పునరుద్ధరణ

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ
- బ్రహ్మోత్సవాలకు కామారెడ్డి ఎమ్మెల్యే సైతం హాజరు

కల్యాణం.. కమనీయం



చుక్కపూర్ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకుని వస్తున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి, మే 23 : కాంగ్రెస్ హయాంలోనే దేవాలయాల పునరుద్ధరణ బాగా జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం మండలంలోని చుక్కపూర్‌లో జరిగిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో షబ్బీర్ అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. దేవునిముందు అందరూ సమానులే అని అన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు గ్రామప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి సైతం ఈ ఉత్సవాలకు హాజరై. స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యదర్శి నరసింహచారి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,నాయకులు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ సేవలు

• జిల్లా న్యాయాధికారి కుంచాల సునీత



ఓపీ సేవలను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ అధికారి కుంచాల సునీత

పెద్దబజార్, మే23: ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ సేవలు ప్రారంభించామని, ప్రతీ ట్రాన్స్‌జెండర్ వైద్యసేవలు పొందాలని జిల్లా న్యాయాధికారి కుంచాల సునీత అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు నిత్యం ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, తమ ఆరోగ్య సమస్యలను, ఏ డాక్టర్‌కు, ఏ ఆసుపత్రిలో చూపించుకోవాలో తెలియక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి కోసం చక్కని పరిష్కారం చూపేలా ఈ ఓపీ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం ఎంతో మందికి వైద్య సేవలను అందిస్తున్నామని, ఇప్పటి నుంచి ట్రాన్స్‌జెండర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేకమైన ఓపీ సేవలు అందిస్తామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేశామని, అందులో నుంచి ఒక ట్రాన్స్‌జెండర్‌ను నియమించి రోగుల ఇబ్బందులను తెలుసుకొని తొందరగా స్పందించేలా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఓపీ సేవలు జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం, అమెరికా, వైజిఆర్ సంరక్షణ, డిఎస్ఎల్ఏ సమన్వయంతో జరుపబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రైనీ ఐపిఎస్ శేషాద్రిరెడ్డి, స్నేహ టిఐ ప్రాజెక్టు స్టాఫ్, ట్రాన్స్‌జెండర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్యారమ్ ఆడుతున్న దృశ్యం

హోరాహోరీగా జాతీయ క్యారమ్ పోటీలు

సుభాష్‌నగర్, మే23: రెండో రోజు ఇన్‌స్టిట్యూషనల్ జాతీయ క్యారమ్ పోటీలు హోరా హోరీగా జరిగాయి. జిల్లాకేంద్రంలోని నవ్యభారతి పాఠశాలలో గురువారం పోటీలు జరిగాయి. పురుషుల జట్టు విభాగంలో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా జైన్ ఇరిగేషన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-1 తేడాతో జైన్ ఇరిగేషన్ జట్టు విజయం సాధించింది. ఏఏఐ, జెఐఎల్ఎస్ మధ్య జరిగిన పోటీలో జేఐఎల్ఎస్ జట్టు గెలుపొందింది. అనంతరం మహిళ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మహిళ పోటీలలో నీలం గౌడ్, షర్మిల మధ్య జరిగిన సింగిల్స్ పోటీలో నీలం విజయం సాధించింది. ఈ పోటీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసక్తికరంగా సాగాయి. సుమారు వందకు పైగా క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భారతీ నారాయణ, ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ డైరెక్టర్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్, శోభన్‌రాజ్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మదన్‌రాజ్, ట్రెజరర్ ప్రవీణ్‌కుమార్, కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

సీతాయిపేట్ గ్రామాన్ని సందర్శించిన పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్

ధర్పల్లి, మే23: మండలంలోని సీతాయిపేట గ్రామాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పల్లె ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో వైకుంఠధాం, నర్సరీ, క్రీడాప్రాంగణం, పల్లెప్రకృతివనం, డంపింగ్‌యార్డు, తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థాయి, మండలస్థాయి అధికారులను పల్లెప్రగతి కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో తడిచెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి ఎరువులను తయారు చేసేలా చూడాలని ఆదేశించారు. తయారైన ఎరువులను స్థానికంగా మొక్కల పెంపకంలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్త ం చేశారు. ఆయనవెంట డీపీవో తరుణ్‌చక్రవర్తి, రీజినల్ పంచాయతీఅధికారి శ్రీనివాస్, ఉండీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఏపీవో వినోద, గ్రామ కార్యదర్శి తిరుపతి, తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత.. ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, మే 23: గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక కిలో 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విలాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకు ఖానాపూర్ గ్రామంలోని జన్నాపల్లి రోడ్డులో బిహార్ రాష్ట్రానికి చెందిన రుదల్‌శర్మ అనే యువకుడు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నామని తెలిపారు. అతనివద్ద 1200 గ్రాముల గంజాయిని పట్టుకొని సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం రుదల్‌శర్మను నిజామాబాద్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పచెప్పడం జరిగిందన్నారు. తనిఖీలో సిబ్బంది సలీమ్, సాగర్‌రావు, కిరణ్‌కుమార్, నీలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

• ఎండు గంజాయి పట్టివేత... ఒకరి అరెస్టు

ఎండుగంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి కిలో 220 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. గురువారం ఖిల్లా చౌరస్తాలో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా షాదుల్లాఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. షాదుల్లాఖాన్‌ను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపర్చామని, త్వరలో పరారీలో ఉన్న యూనస్‌ను అరెస్టు చేస్తామని తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సైలు సుష్మిత, సింధు, సిబ్బంది ప్రభాకర్, షబ్బీర్ ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిల్లా, మే 23: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే కొత్తకాపు అర్చన కన్పించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. యువతికి ఈనెల 12న పెళ్లిచూపులు ఉన్నాయని తెలుపగా ఆమె ఆరోజు నుంచి కనిపించడం లేదని ఆ ఫిర్యాదులో తల్లి పేర్కొంది.

అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ముప్కాల్, మే23: మూగజీవాలకు వైద్యసేవలు అందించే 1962 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ బాగిష్‌మిశ్ర కోరారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో 1962 అంబులెన్స్‌ను పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, పరికరాలను మందులను, పలు రికార్డులను పరిశీలించి పశువులకు అందించే సేవల వివరాలను అడిగితెలుసుకున్నారు. జిల్లాప్రోగ్రాం మేనేజర్ రవి, ఎగ్జిక్యూటీవ్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, శ్రీకాంత్, మహేందర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రుద్రూరులో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రూరు,మే 23:రుద్రూరు మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు.ప్రతి ఏడాది వైశాఖ పౌర్ణమి రోజు శ్రీవారి కల్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈపూజా కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

● శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ

రుద్రూరులోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు గురువారం చేపట్టారు.అదేవిధంగా అన్నదాన కార్యక్ర మం ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు పొందాలి



బీర్కూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రావణ్‌కుమార్

బీర్కూర్, మే 23 : రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో షాపు యజమాని నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలని ఏఈవో శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో ఏఈవో శ్రావణ్‌కుమార్ రైతులతో సమావేశమయ్యారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనే ముందు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అలాగే క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో గడువు తేది, విత్తన రకం తదితర వివరాలను గమనించాలన్నారు. కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రషీదు పొందాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలరు వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, సీల్ సరిగ్గా ఉన్న బస్తాలను, ధృవీకరణ పత్రం (ట్యాగ్) ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తన బస్తాల ప్యాకేజీపై గడువు తేది, రకం పేరు, లాట్ నెంబర్లను గమనించాలని, కొనుగోలు బిల్లుతో పాటు నెంబర్, విత్తన రకం, గడువు తేది ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రసీదు పొందాలన్నారు. రైతులు ప్రైవేట్ విత్తన సంస్థలు చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలను కొనుగోలు చేయడం ఉత్తమమన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. డీలర్ బుక్‌లో రైతులు విధిగా సంతకం చేయాలన్నారు. మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాలు మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. బస్తాలపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉన్నాయా లేవా గమనించాలన్నారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో పెద్దమ్మ ఆలయవార్షికోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఉప్లూర్ పెద్దమ్మ ఆలయం

కమ్మర్‌పల్లి, మే 23: మండలంలోని ఉప్లూర్ గ్రామంలో కొలువుదీరిన ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి ఆలయవార్షికోత్సవ ఉత్సవాలు స్థానిక ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహింపబడతాయని నిర్వహకులు తెలిపారు.మూడు రోజుల పాటు జరిగే ఈఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బోనాల ఊరేగింపు, శనివారం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం, ఆదివారం పవిత్ర గంగాజలాలు దేవతమూర్తుల ఊరేగింపు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు,ఆలయావరణలో మహాజాతర జరుగుతోందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కవాలని సంఘం పాలకవర్గ సభ్యులు కోరారు.

బెదిరించిన ముగ్గురు నిందితులు పరారీ

● నిందితులకు చెందిన బైక్, సెల్‌ఫోన్, కత్తి స్వాధీనం

నవీపేట,మే23: మండలంలోని పోతంగల్ సమీపంలో ఎర్రోళ్ల సంజీవ్ అనే వ్యక్తిని బెదిరించి అతని వద్ద ఉన్న 3,800రూపాయలను ముగ్గురు దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన ప్రకారం నందిపేట మండలం తల్వేదకు చెందిన ఎర్రోళ్ల సంజీవ్ బుధవారం మహారాష్ట్రలోని ధర్మాబాద్ సమీపంలో ఉన్న అత్కూర్‌లో జరిగే ఓ శుభకార్యానికి డప్పు కొట్టడానికి వెళ్లాడు. అదే రోజు పని ముగించుకుని రాత్రి 10గంటలకు ఆటోరిక్షాలో నవీపేటకు చేరుకున్నాడు. తిరిగి తన స్వగ్రామానికి వెళ్లడానికి మండల కేంద్రంలోని నందిపేట రోడ్డులో ఉన్న అలీసాగర్ ప్రధాన కాలువ బ్రిడ్జిపై కూర్చుని ప్రైవేటు వాహనం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి తాము జన్నేపల్లి వెళ్తున్నామని అక్కడి వరకు లిఫ్ట్ ఇస్తామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. మధ్యలో పోతంగల్ సమీపంలో ఉన్న కోళ్ల ఫారం సమీపంలోకి బైక్‌ను మళ్లించగా అక్కడ వీరికి సంబంధించిన మరో వ్యక్తి కూడా ఉన్నాడు. ముగ్గురు కలిసి సంజీవ్‌ను చంపుతామని కత్తి, బీరు సీసాలతో బెదిరించి అతని వద్ద ఉన్న 3,800 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సమయంలో సంజీవ్ తనను కాపాడాలని గట్టిగా కేకలు వేయడంతో రోడ్డుపై వెళ్తున్న పలువురు వారి వద్దకు వెళ్లడానికి యత్నించగా ముగ్గురు నిందితులు పరారీ అయ్యారు. సంఘటన స్థలం నుండి నిందితులకు సంబంధించిన బైక్, కత్తి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా బుద్ధ జయంతి

ఆర్మూర్‌టౌన్, మే23: పట్టణంలోని అశోక్‌నగర్‌లో పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆదర్శం, అసమానత, అశాంతితో ఉన్న భారతవాణికి స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రదత్తం బోధించి నవశకానికి నాంది పలికిన గౌతమబుద్దుని వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్కారి ప్రదీప్, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ ముగ ప్రభాకర్, కార్మిక సంఘం నాయకులు పింజ అశోక్, తలారి చందు, శేట్‌పల్లి నారాయణ, వికాస్, రాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మే23: సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 18,288 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు, 11,363 మంది విద్యార్థులకుగాను 10,209 మంది జనరల్ విద్యార్థులు,1,154 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 6,925 మందిగనుఉ జనరల్ విద్యార్థులు 5,960 మంది, ఒకేషనల్ 965 మంది విదార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని పరీక్ష కేంద్రాలల్లో సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలియజేశారు.

అరచేతిలో మేఘ సందేశం

● రైతులకు బహుళ ప్రయోజనకరంగా యాప్‌లు



మేఘదూత్ యాప్‌లో వాతావరణ విశేషాలు

కోటగిరి,మే23: వాతావరణంలో మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. ప్రధానంగా వర్షకాలంలో వీటి ఉపయోగం ఎక్కువగా ఉండనుంది. మెరుపులు, ఉరుముల నుంచి రక్షించుకోవడం, వర్షం ఎప్పుడు ఎక్కువగా కురిసే అవకాశం ఉందో తెలుసుకుని దాని ప్రకారం నడుచుకునేందుకు వీలుగా భారత భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్‌లు రైతులకు ఎంతగానో దోహదపడతాయని చెప్పవచ్చు. అండ్రాయిడ్ మొబైల్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఆయా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం మీ అరచేతిలో ఉన్నట్లే.

● మెరుపు హెచ్చరిక దామిని

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేందుకు దామిని యాప్ ఉపయోగపడుతుంది. మెరుపు ఎందుకు వస్తుంది. మెరుపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో సవివరంగా వివరించారు. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశం ఉందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సహాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండెచప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చేయాల్సిన పనులను ఇందులో పేర్కొంటుంది.

● వర్షసూచన ఎయిర్ ఈ అలారమ్

ఎప్పటికప్పుడు వర్ష సూచనను ఈ యాప్ మీకు అందుబాటులో తెలస్తుంది. నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణం, వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, మేఘావృతం, తదితర అంశాలను నిలువరిస్తుంది.

● సమగ్ర వివరాలతో మేఘదూత్

మేఘదూత్ యాప్‌లో సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుంది. వర్షపాతం, గాలిలో తేమ, వేగం, గాలి వచ్చే దిక్కు, ఉష్ణోగ్రత తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేస్తుంది. వారం రోజుల ముందు రానున్న నాలుగు రోజుల వాతావరణం విశేషాలను సైతం ఈ యాప్‌లో తెలుసుకోవచ్చు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

భీమ్‌గల్ రూరల్, మే23: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు మందస్తుగా ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు విత్తనాల కొనుగోలులో రైతులు తప్పనిసరిగా విత్తన దుకాణాల నుండి రశీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయికష్ణ పేర్కొంటున్నారు. విత్తన దుకాణాల పై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

● రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు దుకాణం నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.దీన్ని భద్రపరుచుకోవాలి. ప్రభుత్వ అనుమతులు వున్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లులపై విత్తన కంపెనీ నంబర్ తయారీ తేదీ, గడువు తేదీలు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. బిల్లులపై విత్తన కంపెనీ మొలక శాతం,తేమశాతం కచ్చితంగా దుకాణాదారులు అడగాలి.విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలున్నా ,తడిసినా కొనుగోలు చేయ్యవద్దు.. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి. విత్తన సంచులపై ప్రామాణికాలు, ఉత్పత్తి దారులు వివరాలు ఉన్నాయో లేవో చూసుకోవాలి.

● దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు

దుకాణం ఎదుట ధరల వివరాలు బోర్డుపై పొందుపరచాలి. అక్కడ లభించే విత్తనాలు, రకాలను డీలర్ల వివరాలు పేర్కోనాలి. దుకాణం లైసెన్స్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. స్టాక్ రిజిష్టర్లు, విత్తనాల వివరాలు బుక్స్ రిజిష్టర్ నిర్వహించాలి. విత్తనాలు, ఎరువుల విక్రయాలు కంపెనీల పూర్తి వివరాలన్నీ నిత్యం వ్యవసాయ శాఖకు తెలపాలి.



భీమ్‌గల్‌లో విత్తనదుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం

● ఆలయంలో ప్రత్యేక పూజలు ● ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

భిక్కనూరు, మే 23: భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటుగా తన పూర్తి సహకారం ఉంటుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉడిపి పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న వాస్తు నివారణ పూజలలో పాల్గొని మాట్లాడారు. శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని ఆలయ అభివృద్ధికి అడ్వకేట్ రాంరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు ఎంతగానో పాటుపడుతున్నారని అన్నారు. తొమ్మిదిరోజుల పాటు ఉడిపి పండితులతో వాస్తునివారణ పూజలు, హోమాలు చేయ్యడం పట్ల అభినందించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ ఎంతగానో కృషిచేసిందన్నారు. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ మేరకు షబ్బీర్ అలీని రాంరెడ్డి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, పీఠాధిపతి సదాశివమహంత్, ఎంపీపీ గాల్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

పేలిన సెల్‌ఫోన్..తప్పిన ప్రమాదం

నవీపేట,మే23: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో కే.యోగేష్‌కు చెందిన సెల్‌ఫోన్ పేలిపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన ప్రకారం టిప్పర్ డ్రైవర్‌గా పని చేసే యోగేష్ రెండు సంవత్సరాల క్రితం రెడ్‌మీ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ కొనుగోలు చేసి వాడుతున్నాడు.. మంగళవారం రాత్రి తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి టీవీ చూస్తుండగా టెబుల్‌పై పెట్టి ఉన్న సెల్‌ఫోన్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంతో ఎవరికి గాయాలు కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

యువత దేశసంరక్షణకు తోడ్పడాలి

బోధన్‌రూరల్,మే23: యువత దేశసంరక్షణకు తోడ్పడాలని, హిందు ధర్మరక్షణకు ప్రతి యువకుడు సంసిద్ధంగా ఉండాలని శ్రీ బ్రహ్మానంద సరస్వతి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని గోశాలలో వైదిక సత్సంగ యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. యువ చరిత్ర నిర్మాణ శిబిరం, యువతను సంస్కార వంతులుగా చేసి వారి చరిత్ర నిర్మాణం చేయుటకు ఆత్మరక్షణ ఉపాయం నేర్పించుటకు శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు హిందు ధర్మ సంప్రదాయాన్ని పాటించాలన్నారు. హిందు ధర్మరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహ భాగ్యమని ఆరోగ్య సంరక్షణ కోసం యోగాసనాలు చేయాన్నారు.ఈ కార్యక్రమంలో గోశాల నిర్వహణ కమిటీ సభ్యులు ప్రదీప్ గుప్తా, లడ్డు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోవిందా నామ స్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్,మే23: గోవిందా నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు శ్రీమన్ గోవర్ధన రాఘవచార్యులు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో 11వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, భగవంత్ అనుజ్ఞ ఆరాధన, పుణ్యవచనం, రక్షబంధనం, ముత్సంగ్రహణం, అంకురార్పణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని నిత్యం గోవిందా నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నవీపేటలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,మే23: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుక్రవారం ఉదయం నవీపేటలో పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భగవాన్‌లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆయన పరిశీలించనున్నారని వారు పేర్కొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ మదర్‌బోర్డు చోరీ

ఆర్మూర్‌టౌన్, మే23: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో గుర్తు తెలియని దొంగలు ట్రాఫిక్ సిగ్నల్స్ మదర్‌బోర్డును ఎత్తుకెళ్లారు. గత మూడు రోజుగా సిగ్నల్స్ పని చేయకపోవడంతో మున్సిపల్ కమిషనర్ నిర్వహకులకు సమాచారం ఇవ్వగా గురువారం సిగ్నల్స్‌ను పరిశీలించడంతో మదర్‌బోర్డును ఎవరో ఎత్తుకెళ్లారని, సుమారురూ.80వేల విలువ ఉంటుందని పోలీసులకు మున్సిపల్ కమిషన్ ఫిర్యాదు చేశారు.

ప్లాస్టిక్‌పై తనిఖీలు



షాప్ యాజమానికి జరిమానా వేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్, మే23: పట్టణంలోని పలు హోటళ్లు, దుకాణాలు, బేకరీలలో ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ మైక్రన్ గల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని పలు షాప్ యాజమానులకు జరిమా నాలు రూ.10వేల500 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టార్ మహేష్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది వెంకటేష్, అక్షయ్, రవి, ప్రశాంత్, నరేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీరుసీసాతో వ్యక్తిపై దాడి

● ముక్కుకు తీవ్ర గాయాలు

నవీపేట,మే23: నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన చంద్రశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన వెంకటేష్ బీరు సీసాతో గురువారం సాయంత్రం దాడిచేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అకారణంగా బీరుసీసాతో వెంకటేష్ దాడి చేయడంతో చంద్రశేఖర్ ముక్కుపై తీవ్ర గాయమైందని వెంటనే అతనిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం జరిగిందని వారు పేర్కొన్నారు. దాడి విషయమై గురువారం రాత్రి నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై నవీపేట ఏఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,మే23: కోటగిరి మండల కేంద్రంలో బారడి పోచమ్మ ఆలయం సమీపంలో గురువారం మూడు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. పొతంగల్ మండలం సుంకిని మంజీర నది నుండి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



చౌట్‌పల్లి స్వామివారి దర్శనార్థం బారులుతీరిన భక్త జనం

కమ్మర్‌పల్లి, మే 23: కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల అమర్‌నాథ్‌చారి, వేద పండితులు గంగప్రసాద్ దీక్షితులు, చంద్రశేఖర్ శర్మ, రాజాగౌతమ్ తదితర పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామివారి సర్వదర్శనార్థం గ్రామస్థులు మహిళలు పెద్ద సంఖ్యలో బారులుతీరారు. సర్వదర్శనం, నిత్యహోమం,అష్టాక్షరిహోమాలు, బలిహరనము, ప్రసాద వితరణ, పూర్ణహుతి, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మారుశంకర్, ఎంపీటీసీ ఏశాల నర్సయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుంట రమేష్‌రెడ్డి కమిటీ సభ్యులు, వివిధ రాజకీయపార్టీ నాయకులు, కార్యకర్తలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, మే23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వెంకటేశ్వరకాలనీలో గురువారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల తలంబ్రాల ఊరేగింపు, సౌభాగ్య హోమం,స్వామివారికల్యాణం,అనంతరంఅన్నదానం నిర్వహిం చారు. వేదపండితులు చిలకమర్రి వర్ధనాచార్యులు, ఆనంద చార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గడ్డం శ్రీని వాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మహిళలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చందూర్‌లో హోరాహోరీగా కుస్తీపోటీలు





కుస్తీపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వర్ని,మే23: చందూర్ మండల కేంద్రంలో గురువారం కుస్తీపోటీలను హోరాహోరీగా నిర్వహించారు.మూడు రోజుల పాటు రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా చిన్నాల పౌర్ణమి రోజు ఆనవాయితీగా ఈ పోటీలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జాతర, రథోత్సవం నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిసరాలతో పాటు మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జడ్పీటీసీ అంబర్ సింగ్, ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, వైస్ ఎంపీపీ దశాగౌడ్, విండో చైర్మన్ ప్యారం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై హత్యాయత్నం



జిల్లా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎడపల్లి ఎస్సై

ఎడపల్లి, మే 23: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్ కట్టపై గురువారం ఉదయం తెల్లవారు జామున కాలి నడక చేస్తున్న జానకంపేట గ్రామస్థులకు మల్లన్న గుడి వద్ద ఓ యువతి అపస్మారక స్థితిలో పడి ఉన్న దృశ్యం కనిపించడంతో వెంటనే వారు ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ యువతిని పరీక్షించగా తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండడంతో వెంటనే నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మైనర్ బాలిక నిజామాబాద్ పట్టణానికి చెందిన బాలికగా విశ్వసనీయ సమాచారం.బుధవారం సాయంత్రం జానకంపేట గ్రామ శివారుకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డిని వివరణ కోరగా బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని బాలిక మాట్లాడలేని స్థితిలోఉండడంతో వివరాలు ఇంకాతెలియరాలేదని, వివరాల సేకరణకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు


భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్న దృశ్యం

బాన్సువాడటౌన్, మే 23: పట్టణంలోని కల్కి చెరువు కట్టపై గల శ్రీమ ఋమాన్ సాయి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు పవన్‌శర్మ బాబా మూలవిరాట్టుకు అభిషేకాలు, అర్చనలు చేపట్టి నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని బాబా వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

'శాంతినికేతన్ ముసుగులో ఇంపల్స్‌స్కూల్'



నిరసన తెలుపుతున్న ఏబీవీపీనాయకులు

కామారెడ్డిటౌన్,మే 23:శాంతినికేతన్ స్కూల్ ముసుగులో ఇంపల్స్‌స్కూల్ నడుపు తున్నారని ఏబీవీపీ నాయకులు అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ స్కూల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు ఖలీల్‌రోహిత్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మ డమే కాకుండా పాఠశాల పేరును ఇంపాల్స్‌గా మార్చి ప్రచారాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంపాల్స్‌స్కూల్ నడిపించ డానికి ఎలాంటి పర్మిషన్లు లేవని తెల్చిచెప్పిన ఎంఈవో మాటలు కూడా లెక్కచేయకుండా అడ్మిషన్ ప్రక్రియను నడిపిస్తు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ఆపివే యాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నవీన్,రాజు,అల్తాఫ్,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్‌లు

మాచారెడ్డి,మే 23: మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామశివారులోని గ్రామవాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు మాచారెడ్డి ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.చుక్కాపూర్ గ్రామశివారులోని గ్రామవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను,సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులునమోదుచేశామని తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హిందూసంస్కృతిని కాపాడడం పౌరుల ధర్మం


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న దృశ్యం

సదాశివనగర్,మే 23:భారతీయసంప్రదాయాలను హిందూధర్మ ఆచారలను కాపాడడం ప్రతి భారతపౌరుని ప్రథమకర్తవ్యం అని మహానుభావుడు మహంతి శ్రీ మాచాలేబాబా అన్నారు. మహానుభావుడు దీనబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారంరోజులుగా నిర్వహించిన బాలసంస్కార శిబిరం చివరి రోజు పాల్గొన్న ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలను ఆచరించే విధంగా తల్లిదండ్రులు కృషిచేస్తు తల్లిదండ్రుల గౌరవం,సంస్కృతి సంప్రదాయాలను నేర్పుతూ భగవంతుని సేవ భగవద్గీత పఠనం హిందూ ధర్మ ఆచారం తదితర అంశాలపై చిన్నారులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.వారంరోజుల పాటు బాలసంస్కార శిబిరం నిర్వహణ కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహానుభావులు కన్హేరాజ్‌బాబా, సారంగ బాబా, మురళి బాబా, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రుద్రూరులో విత్తన మేళా

రుద్రూరు, మే 23: రుద్రూరు మండలంలోని ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీ నాయక్ తెలిపారు. పరిశోధన కేంద్రంలో ఆర్‌డీఆర్-1200, ఆర్‌డీఆర్-1162 వరి రకాలు, సోయా చిక్కుడు బాసర రకం అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భిక్కనూరు, మే 23: మండలంలోని గుర్జకుంట గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒడ్డె వెంకటీ అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్ కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేయ్యడం జరిగిం దని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు వెంకటీ మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు కందడి రమే ష్‌రెడ్డి, పుట్ట రమేస్, భూపాల్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో దివ్యాంగుల సర్వే


సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు,మే 23: మండలంలోని అన్నిగ్రామాల్లో సమగ్ర శిక్షఆధ్వర్యం లో దివ్యాంగుల సర్వే కార్యక్రమాన్ని నిర్వమించడం జరుగుతుందని ఐఈ ఆర్‌పీ మహేందర్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలోనిఅన్నిగ్రామాల్లో ఈ నెల 31వరకు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, సర్వే బాగంగా ప్రతి గ్రామంలో వివిధ రకాల వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారి పూర్తి వివరాలను నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ అడ్మిషన్లు

- జిల్లాలో 86 ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలలు
- ప్రవేశాలపై మార్గదర్శకాలు విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు
- ఎస్ఎస్‌సీలో వచ్చిన గ్రేడింగ్ ఆధారంగా చేరికలకు అవకాశం
- నిర్వహణసరిగా లేని కళాశాలలపై పర్యవేక్షణ కరువు
- కళాశాలల్లో హాస్టళ్లు, కోచింగ్ సెంటర్ల నిర్వహిస్తున్నా పట్టించుకోని వైనం



కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కామారెడ్డిటౌన్,మే 23:ప్రభుత్వ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఇంటర్‌మీడియట్ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వకముందే ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించుకునేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అడ్మిషన్లకు అవకాశం కల్పించింది.అప్లియేషన్ ఉన్నకళాశాలల్లో మాత్రమే విద్యార్థులు చేరాలని సూచించింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్‌కళాశాలలు 86 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 46 కేజీబీవీ,రెసిడెన్సియల్, గురుకుల తదితర ప్రభుత్వ కళాశాలలు, 20 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

● అప్లియేషన్ ఉన్న వాటిలోనే

అడ్మిషన్లు కేవలం అప్లియేషన్ ఉన్న కళాశాలల్లోనే చేరాలని ఇంటర్ మీడియట్ సూచిస్తుంది. అయితే కొన్ని కళాశాలలో ఫైర్ సెఫ్టి లేకపోవడం, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉండడం ప్రధాన సమస్యగా కాగా అప్లియేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరిస్తుంది. అయితే ఫైర్ సెఫ్టికి సంబంధించి గతేడాది ఒకేసారి రెండేళ్లకు అనుమతి ఇచ్చింది. 17 మీటర్ల కన్న తక్కువ ఎత్తు ఉన్న వాటికే ఎన్ఓసీ ఇవ్వనున్నట్లు తెలిసింది. సిబ్బంది వివరాలు, స్ట్రక్చరల్ సౌండ్, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, సేల్ డీడ్,అగ్రిమెంట్ వంటివి ప్రభుత్వానికి అప్లియేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● నిబంధనలు పాటించాల్సిందే

ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియలో పలు నిబంధనలు పాటించాలని ప్రభు త్వం సూచిస్తుంది. ఇందులో ప్రధానంగా ఇంటర్‌లో కేవలం టెన్త్ జీపీఏ ఆధారంగా అడ్మిషన్‌లు తీసుకోవాలి. అలాగే ప్రతి కళాశాలలో రిజర్వేషన్‌లు ఖచ్చితంగా అమలుచేయాలి. ఎస్సీలకు 15, ఎస్టీలకు 10,బీసీలకు 29, పీహెచ్‌సీ 3,ఎన్‌సీసీ, స్పోర్ట్స్ ఇతర అర్హతలు 5, ఎక్స్‌సర్వీస్ వారి పిల్లలకు 3, ఈడబ్ల్యుఎస్ వారికి 10శాతం కేటాయించాలి. ముఖ్యంగా బాలికల్లో 33శాతం రిజర్వేషన్ పాటించాలని సూచించింది. ఒక సెక్షన్‌లో 88 మందిని మాత్రమే చేర్చుకోవాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు సెక్షన్ కోసం బోర్డు నుంచి అనుమతి తీసుకోవాలి. విద్యార్థుల చేరికలు, ఖాళీలకు సంబంధించి ప్రతిరోజు వివరాలను బోర్డుపై ప్రదర్శించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేసుకుంటామని అధికారులు ఇప్పటికే హెచ్చరికలు సైతం జారిచేశారు.

● అడ్డగోలుగా నిర్వహణలు

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అడ్డగోలుగా నిర్వహిస్తున్నాయి.కొన్ని ఒకేషనల్ కళాశాలల్లో ల్యాబ్‌లు ఇతరపరికరాలు లేకుండా తూతూమంత్రంగా నెట్టుకోస్తున్నాయి. అధికారులు తనిఖీల సమయంలో నామమాత్రంగా ఎక్విప్‌మెంట్ పెట్టి మేనేజ్ చేస్తున్నారు. అధ్యాపకులు సైతం సరిగా లేకపోవడం, ఒకే అధ్యాపకుడితో పలు సబ్జెక్టులు బోధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ కళాశాలల్లో పలుచోట్ల సరైన సదుపాయాలు,బోదించేందుకు సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలతో సతమతవుతున్నాయి. ఈ కారణాలతోనే ప్రతి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనకబడుతున్నట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా కొన్నికళాశాలల్లో అనుమతులు లేకుండా హాస్టళ్లు, కోచింగ్ సెంటర్ల నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

సొసైటీలలో అందుబాటులో ఉన్న జీలుగ విత్తనాలు

రాజంపేట,మే 23:రాజంపేట మండల కేంద్రంతో పాటు ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో శుక్రవారం నుంచి జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఏవో సుప్రజ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగ బస్తా 30కిలోలు మొత్తం ధర రూ. 2790గా ఉండగా ప్రభుత్వ సబ్సిడీ 1674 పోను రైతులు 1116 చెల్లిం చాల్సి ఉంటుందని తెలిపారు. మండలంలోని విత్తనాలు కావాల్సిన రైతులు పటాదారు పాస్‌బుక్‌జిరాక్స్‌ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని సొసైటిలో ఏఈవో దగ్గర పర్మిట్‌రాయించుకోని విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. మండలంకు సంబంధించిన రైతులకు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

●అందుబాటులో గాంధారి పీఏసీఎస్‌లో జీలుగ విత్తనాలు

గాంధారి, మే 23:గాంధారి మండల పరిధిలోని రైతులకు గాంధారి పీఏసీఎస్‌లో జీలుగ విత్తనాలు 333 బస్తాలు,ముదోలి పీఏసీఎస్‌లో,గాంధారి ఆగ్రోస్ రైతు సేవకేంద్రం 166 బస్తాల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో నరేష్ తెలిపారు. రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని వ్యవసాయ విస్తరణాధికారి వద్ద పర్మిట్ రాయించుకోవాలని వ్యవసాయాధికారి తెలిపారు.జీలుగా 30 కిలోల బస్తా 2 ఎకరాల 20గుంటలకు వస్తుదని తెలిపారు. 30 కిలోల బస్తాకు 60 సబ్సిడి పోను రైతులు 1116 చెల్లించి తీసుకోవాలని తెలిపారు.

బోల్తాపడిన టిప్పర్


తాడ్వాయి శివారులో బోల్తాపడిన టిప్పర్

తాడ్వాయి,మే 23:తాడ్వాయి శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రోడ్డుపై గురువారం టిప్పర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో త్రుటిలో ప్రాణపాయం తప్పింది. తాడ్వాయిలో మొరం నింపుకుని కామారెడ్డి వైపు కు వెళ్తుండగా టిప్పర్ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. డ్రైవర్ నర్సింలుకు స్వల్ప గాయాలయ్యాయి. టిప్పర్ తక్కువ వేగంతో ఉండడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు వాపోయారు. వెంటనే నర్సింలును చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాలల్లో పౌష్టికాహార లోపం



పిట్లంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

పిట్లం,మే23: ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలల్లో గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు పౌషికాహారం అందిస్తున్న సిబ్బంది పని తీరు సరిగ్గా లేక పౌషికాహారం లోపం వస్తోందని ఐసీడీఎస్ అధికారులపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసమా వేశంలో వ్యవసాయశాఖ అధికారి కిషన్ నివేదికలు చదువగా ఈసం వత్సరం నుంచి రైతులకు దొడ్డు వడ్లు, సన్నరకానికి 500 రుపాయల బోనస్ ఇవ్వాలని ప్రజాప్రతి నిధులు సమావేశంలో డిమాండ్ చేశారు.సహకార సంఘాలలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సమావేశంలో మాట్లాడారు.విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలలో విద్యుత్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎంపీపీ అధికారులకు ఆదేశించారు.ఉపాధిహామీ పథకంలో గ్రామీణ ప్రాంతాలలో రైతులకు పర్మిషన్ రోడ్లు వేయాలని, కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని తెలిపారు.అంగన్‌వాడి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు నివేదికలు చదువుతుండగా ప్రజాప్రతి నిధులు సమస్యలపై నిలదీశారు.ప్రతీ గ్రామంలో సూపర్‌వైజర్‌లు పరివేక్షణ కరువై అంగన్‌వాడి సిబ్బంది సమయ పాలన,పౌష్టికాహారం బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు అందడం లేదన్నారు.ప్రభుత్వం అన్ని వసతులు,పౌష్టికాహారం అందిస్తున్నఎందుకు కేంద్రాలలో సవస్యలు తలెత్తున్నాయని ఎంపీపీ సూపర్‌వైజర్‌లను అడగగా సమాధానం రాకపోవడంతో పని తీరు మార్చుకోవాలని లేదంటె చర్యలు ఉంటాయన్నారు.అయాశాఖల అధికారులు వారి వారి నివేదికలు చదివి వినిపించారు.ఈసమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో, డిప్యూటి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో బ్రహ్మం, ఎంపీటీసీలు, సింగల్‌విండో చైర్మన్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మాచారెడ్డి,మే 23:మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం అంగరంగవైభవంగా నిర్వహించారు.స్వామివారికి మహిళ భక్తులు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణ మంతా గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ కమలాకర్‌రెడ్డి, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణనగర్ తండాలో మహిళ దారుణ హత్య

బాన్సువాడ,మే23: బాన్సువాడ మండలం కృష్ణనగర్ తండా అటవీ ప్రాంతంలో మహిళా దారుణ హత్యకు గురైంది. వివరాల్లోకి వెళితే గాంధారి మండలం బురుగుల్ గ్రామానికి చెందిన లక్ష్మీఅనే యువతి సంతల్లో కూరగాయాలు అమ్ముకుంటూ జీవనం గడుపుతుంది. గత గురువారం బాన్సువాడ మార్కెట్‌లో సంతలో కూరగాయాలు అమ్ముకున్న తరువాత ఆమె అదృశ్యమైంది. తన భార్య అదృశ్యమైనట్లు గాంధారి పోలీస్ స్టేషన్‌లో భర్త లింగం ఫిర్యాదు చేశారు. గురువారం బాన్సువాడ మండలం ఇబ్రహీం పేట్ అటవీ ప్రాంతంలో లక్ష్మీ మృత దేహం బయట పడింది. వారంరోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు అక్కడ మృత దేహాన్ని చూస్తే అర్థమవుతుంది. పూర్తిగా కుళ్లిపోయి ఆనవాళ్ల గుర్తు పట్టకుండా ఉంది. ఆమె కుటుంబ సభ్యులు చనిపోయిన యువతి లక్ష్మీఅంటూ పోలీసులకు వెల్లడిస్తున్నారు. బాన్సువాడ సీఐ సం ఘటన స్థలం చేరుకుని మృతికి గల కారణాలను ఆరా తీసున్నారు.

బిచ్కుందలో సినిమాషూటింగ్

బిచ్కుంద,మే23:మండల కేంద్రంలోని పెద్దతక్కడపల్లి నుంచి బిచ్కుంద రోడ్డు మార్గంలో సినిమాషూటింగ్ చేశారు. పల్లెవెలుగు బస్సు లో ప్రయాణికులప్రయాణం చిత్రీకరణ గ్రామీణ ప్రాంత నేపథ్యంలో సినిమా షూటింగ్ తీయడం జరిగింది. సినిమాషూటింగ్ చేయడంతో పెద్ద ఎత్తున ప్రజలు బారులు తీరారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి


కంచర్లలో ధాన్యాన్ని పరిశీలస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 23: కొనుగోలుకేంద్రాల వద్ద తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లు లకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు.గురువారం భిక్కనూరు మండలంలోని కంచర్ల, బస్వాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలిం చారు. ముందుగా తక్కువ ధాన్యం ఉన్న కేంద్రాలలో వెంటనే ధాన్యాన్ని తూకం వేసి ముగించాలన్నారు. డీఎస్వో, జిల్లా మేనేజర్, తహసీల్దార్లు, సిబ్బంది సైతం విస్తృతంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ ఎప్పటి కప్పుడు సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు.గురువారం 208లారీలనుసమకూర్చి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్‌లకు తరలించా మన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 350కొనుగోలు కేంద్రాలకు గానూ 263 కేంద్రాలలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో మల్లిఖార్జున్‌బాబు, జిల్లా మేనేజర్ నిత్యానందం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత


విద్యార్థులను అభినందిస్తున్న ఉపవైద్యబృందం

బీబీపేట,మే 23:బీబీపేట మండలంలోని మందాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు తెలంగాణ జీవవైవిధ్యబోర్డ్ ఆధ్వర్యంలో ప్రకృతి, జీవ వైవిధ్యం అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, కార్టున్‌డిజైనింగ్,ఉపన్యాస పోటిలలో టీ.దీపిక, స్వాతి మొదటిబహుమతిని, సీహెచ్ శ్రీనిధి రెండో బహుమితి, అర్చన మూడో బహుమతి పొందడం జరిగిందని తెలిపారు. వీరికి హైదరాబాద్ డీఎఫ్‌క్ష జోజి బహుమతుల ప్రధానం చేయడం జరిగిందని పాఠశాల బృందం వారిని అభినందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ వైర్ చోరీ


తాండూర్ శివారులో చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నాగిరెడ్డిపేట,మే 23:మండలంలోని తాండూర్ గ్రామ శివారులో గల మూ డు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి బుధవారం రాత్రి గుర్తు తెలి యని దుండగులు ఆయిల్, కాపర్ వైర్ ను చోరీ చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తెలిపారు. తాండూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో గల ఎస్ఎస్ నెంబర్ 25, 29, 32 వ్యవసా య విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి రాత్రి వేళల్లో గుర్తు తెలియని దుండగులు సుమారు 150 లీటర్ల ఆయిల్‌ను, కా పర్ వైర్‌ను చోరీ చేసినట్లు వారు తెలి పారు. మూడు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి దొంగిలించిన ఆయిల్, కాపర్ వైర్ విలువ సుమారు మూడు లక్షల వరకు ఉంటుందని వారు తెలిపారు. ఈ మేరకు రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సుమారు 20 రోజుల వ్యవధిలోనే మండలంలోని వివిధ గ్రామాలలోని 11 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి రాత్రివేళల్లో గుర్తు తెలియని దుండగులు ఆయిల్‌ను, కాపర్‌ను దొంగిలించుకుపోయినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల నుంచి రాత్రి వేళల్లో దుండగులు ఆయిల్‌ను, కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నందున రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ముస్తాబైన రేణుక ఎల్లమ్మ ఆలయం

రామారెడ్డి,మే 23: రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలోని శ్రీరేణుకదేవి(ఎల్లమ్మ)జమదగ్నిల కల్యాణ మహోత్సవాలకు ఆలయంను సిద్ధం చేశారు. ఈనెల 26 నుంచి 29 వరకు పలు కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు సింగిల్‌విండో డైరెక్టర్ స్వామిగౌడ్ తెలిపారు.ఎల్లమ్మ దేవి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సంఘనాయకులు తెలిపారు.ఈకార్య క్రమంలో నాయకులు గంగా రెడ్డి,మైసాగౌడ్, దయానంద్, చిన్నరాజం, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని జయంతి వేడుకలు


బరంగేడ్గిలో బుద్ధజయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, మే 23: బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో గురువారం అంబేద్కర్ సంఘం, బాబా సాహెబ్ యూత్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనం తరం గౌతమ బుద్ధుడి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. హిందూమతంలో వైశాఖ పూ ర్ణిమకు చాలా ప్రాధాన్యత ఉంది. ప్రతి సంవ త్సరం వైశాఖ మాసంలో పౌర్ణమి రోజున వైశా ఖ పూర్ణిమ వస్తుంది. ఈ పౌర్ణమి రోజు గౌతమ బుద్ధు డు పుట్టాడని, జ్ఞానోదయం కూడా ఇదే రోజు అయిందని తెలిపారు. హిందూ మతాన్ని అనుస రించే వారు వైశాఖ పౌర్ణమిని బౌద్ధమతాన్ని అనుసరించేవారు బుద్ధ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ స భ్యులు సిద్దార్థ్, బస్వంత్, యాదు, సీరడి రాములుగైనిరాములు, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210